

అడ్డగుట్టలో వరలక్ష్మి పూజలో..

షాబాజ్‌గూడలో కార్పొరేటర్ పర్యటన



షాబాద్‌గూడ సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ సామల హేమ

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ షాబాజ్ గూడలో కొనసాగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం స్థానిక కార్పొరేటర్ సామల హేమ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ.18 లక్షలతో ఇక్కడ రోడ్డు నిర్మాణం పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా స్థానికులు తమకు పురాతన కాలంలో వేసిన డ్రైనేజీ లైన్ కారణంగా మురుగునీటి సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయన్నారు. కొత్త లైన్ నిర్మించి సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. జలమండలి అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని కార్పొరేటర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ కౌశిక్, స్థానిక నాయకులు శైలెందర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు

దేశపాక వెంకన్నకు ఓయూ డాక్టరేట్



దేశపాక వెంకన్న

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ సోషియాలజీ విభాగంలో దేశపాక వెంకన్నకు పీహెచ్‌డీ డాక్టరేట్ లభించింది. సోషియాలజీ విభాగం అధ్యాపకురాలు ప్రొ.సునంద పాండే పర్యవేక్షణలో నల్గొండ జిల్లాలో ప్రజారోగ్యంపై ఫ్లోరైడ్ నీటి ప్రభావం అనే అంశంపై డాక్టరేట్ లభించినట్లు తెలిపారు. పేదకుటుంబానికి చెందిన ఆయన ఉన్నత విద్యపై ఆసక్తితో కూలి పనులు, సెక్యూరిటీ గార్డు ఉద్యోగం చేస్తూ చదువుకున్నట్లు తెలిపారు.

11న వ్యాసరచన, జీకే పోటీలు

సనత్‌నగర్: మోడల్‌కాలనీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీన పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన, జనరల్ నాలెడ్జ్ పోటీలను నిర్వహించనున్నట్లు జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్ ఆసరా కమిటీ ఉపాధ్యక్షుడు, సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జేఏ స్టీ సాయి తెలిపారు. 'తల్లిదండ్రుల (వయోవృద్ధుల) పోషణ–పిల్లల కర్తవ్యం' అనే అంశంపై వ్యాసరచన పోటీ ఉంటుందన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిర్వహించే ఈ పోటీల్లో 7వ తరగతి నుంచి 10వ తరగతి చదువుకునే విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. మోడల్‌కాలనీలోని సంస్కృతి కమ్యూనిటీ హాల్‌లో ఉదయం 11 గంటల నుంచి పోటీలు ప్రారంభమవుతాయని చెప్పారు. ఆసక్తి కలిగిన పాఠశాలలు, విద్యార్థులు ఫోన్: 94408 94873.

యూపీహెచ్‌సీలకు స్థలాలు కేటాయించండి



సీఈఓ మధుకర్ నాయక్‌తో ఎమ్మెల్యే శ్రీగణేశ్

కంటోన్మెంట్: నియోజకవర్గంలో మంజూరైన యూపీహెచ్‌సీ(అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్స్)కు అనువైన స్థలాలను కేటాయించాలని ఎమ్మెల్యే శ్రీగణేశ్, బోర్డు సీఈఓ మధుకర్ నాయక్‌ను కోరారు. ఈ మేరకు శుక్రవారం బోర్డు కార్యాలయంలో సీఈఓతో భేటీ అయ్యి పలు సమస్యలపై చర్చించారు. కంటోన్మెంట్‌లో నాలుగు యూపీహెచ్‌సీలు ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సుముఖంగా ఉందన్నారు. ప్రజావసరాల మేరకు వీటిని ఏర్పాటు చేయాలన్నారు. బొల్లారంలో కంటోన్మెంట్ జనరల్ ఆస్పత్రి ఆవరణలో యూపీహెచ్‌సీ ఏర్పాటు వల్ల ప్రయోజనం ఉండదని, దీన్ని ఏడోవార్డు పరిధిలోని టీచర్స్ కాలనీలో ఏర్పాటు చేయాలన్నారు. నియోజకవర్గం పరిధిలో పలు బస్తీల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు తగిన భవనాలు అందుబాటులో లేవని తెలిపారు. మడ్‌ఫోర్ట్ అంబేడ్కర్ నగర్ బస్తీలో అంగన్‌వాడీ ఏర్పాటు చేయాలని కోరారు.

పూడిక తీయక.. వరదనీరు సాఫీగా సాగక..

- శ్యాంలాల్ బిల్డింగ్స్‌లో ఎన్నడూ లేనివిధంగా వరద
- అల్లాడుతున్న శ్యాంలాల్ నివాసితులు..
- కాంట్రాక్టర్ నిర్లక్ష్యం.. ప్రజలకు తప్పని 'వరద' తిప్పలు

సనత్‌నగర్: ఇటీవల కురుస్తున్న వర్షాలకు బేగంపేట శ్యాంలాల్ బిల్డింగ్స్‌లో ఎప్పుడూ లేనంతగా వరద బీభత్సం సృష్టిస్తోంది. వర్షం మొదలయ్యిందంటే చాలు ఆ ప్రాంతంలోని ప్రజలు వణికిపోతున్నారు. ఒకప్పుడు వర్షాకాలం వచ్చిందంటే మయూరిమార్గ్, అల్లంతోటబావి, బ్రాహ్మణవాడీ ప్రాంతవాసులు అల్లాడిపోయేవారు. కంటి మీద కునుకు కూడా లేని పరిస్థితి. గత ప్రభుత్వ హయాంలో ఎస్‌ఎన్‌డీపీలో భాగంగా చేపట్టిన నాలా ఆధునీకరణ కోసం రూ.40 కోట్లు మంజూరు చేసి పనులను చేపట్టి వరద సమస్యను ఒక కొలిక్కి తీసుకువచ్చారు. రోజుల తరబడి కాకుండా కొద్ది గంటల్లోనే నీరు తొలగిపోయే పరిస్థితికి తీసుకువచ్చారు. కానీ ఈ మధ్యకాలంలో కురిస్తున్న భారీ వర్షాలకు మయూరిమార్గ్, అల్లంతోటబావి, బ్రాహ్మణవాడీ పరిస్థితులు ఎదుర్కొన్న అనుభవాలనే శ్యాంలాల్‌బిల్డింగ్స్ వాసులు ఎదుర్కోవడం గమనార్హం.

తూములు పూడుకుపోవడంతోనే..

శ్యాంలాల్ బిల్డింగ్స్ నుంచి వచ్చే మురుగు అంతా రోడ్డుకు అవతల వైపు ఉన్న ప్యాంటలూమ్స్, అల్లంతోటబావి మీదుగా ప్రకాష్‌నగర్ ఎక్స్‌టెన్షన్ వరకు వెళ్లి కూకట్‌పల్లి నాలాలో కలుస్తోంది. ఈ క్రమంలో బేగంపేట ప్రధాన రహదారి కిందుగా వేసిన నాలుగు తూముల ద్వారా మురుగు, వరదనీరు వెళ్లాల్సి ఉంటుంది. అసలే ప్యాంటలూమ్స్, అల్లంతోటబావి వద్ద నాలా వెడల్పు అంతంతమాత్రంగానే ఉంటుంది. దీనికి తోడు నాలుగు తూముల్లో రెండు పూర్తిగా పూడికపోవడం, మరో రెండు మార్గాల నుంచి పాక్షికంగానే నీరు పారుతోంది.



భారీ వర్షానికి శ్యాంలాల్ బిల్డింగ్స్‌ను ముంచెత్తిన వరద

దీని కారణంగానే వరద శ్యాంలాల్‌ను ముంచెత్తుతోంది. దీనికి తోడు కూకట్‌పల్లి నాలా ఉధృతంగా ప్రవహిస్తూ నీటి మట్టం కూడా భారీగా పెరిగింది. ఈ క్రమంలో నాలాల్లోకి కలిపిన డ్రైనేజీ పైపుల నుంచి నాలాలో నీరు రివర్స్‌లో వస్తుండటం కూడా వరద బయటకు వెళ్లకపోవడానికి మరో కారణం. మూడు రోజుల క్రితం జీహెచ్‌ఎంసీ–హైడ్రా సిబ్బంది కొంతమేర శ్రమించి అడ్డుగా ఉన్న వ్యర్థాలను తొలగించారు కానీ, పూర్తిస్థాయిలో తొలగించలేదు. దీంతో మళ్లీ సమస్య అలాగే ఉండటంతో గురువారం సాయంత్రం కురిసిన వర్షాలకు వరద ముంపు పరిస్థితి షరా మామూలే.

ఎందుకింత నిర్లక్ష్యం..

సాధారణంగా వర్షాకాలానికి ముందే పూడికతీత పనులు పూర్తిచేయాల్సి ఉంటుంది. అది కూడా తూతూ మంత్రంగా కాకుండా శాస్త్రీయబద్ధంగా చేపట్టాల్సి ఉంటుంది. కేవలం పూడికతీత కోసం ప్రభుత్వం ప్రతి సంవత్సరం కోట్లాది రూపాయల నిధులను కూడా కేటాయిస్తూ వస్తోంది. పెద్ద మొత్తంలో నిధులు పూడికతీత కోసం ఖర్చు చేస్తున్నా పూర్తిస్థాయిలో పూడికతీత పనులు చేపట్టడం లేదు. ఇందుకు నిదర్శనమే శ్యాంలాల్ బిల్డింగ్స్ నాలా పరిస్థితి. తూముల్లో పూర్తిగా పూడిక తొలగించకపోవడంతో ఆ ఫలితాన్ని శ్యాంలాల్ బిల్డింగ్స్ ప్రజలు అనుభవించాల్సి వస్తోంది. అదే వర్షాకాలానికి ముందే పూడికతీత పనులు పూర్తి చేసి ఉంటే ఇంతటి పరిస్థితి ఉండేది కాదని, ఇళ్లు మునిగిపోయే పరిస్థితి ఎప్పుడూ లేదని పలువురు వాపోయారు. ఇక్కడి పూడికతీత విషయమై వేసవికాలంలోనే అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పెడచెవిన పెట్టడం వల్లే తమకు వరద ముంపు తలెత్తిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

సీఎం సహాయనిధి ప్రతాలు అందజేసిన ఎమ్మెల్యే



సీఎం సహాయనిధి ప్రతాలు అందజేస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

సికింద్రాబాద్: సికింద్రాబాద్‌లోని మాణికేశ్వరి నగర్‌కు చెందిన కోడాది పర్నిక, ఏసీఎస్ నగర్‌కు చెందిన కే.సుధాకర్ అనారోగ్యంతో సతమతమవుతున్న దశలో సికింద్రాబాద్ ఎమ్మెల్యే కార్యాలయాన్ని ఆశ్రయించారు. స్థానిక శాసనసభ్యుడు తీగుల్ల పద్మారావు సిఫారసు మేరకు వారి వైద్య ఖర్చుల నిమిత్తం ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరయ్యాయి. సదరు ఎల్‌ఓసీ పత్రాలను శుక్రవారం సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వారి కుటుంబ సభ్యులకు పద్మారావుగౌడ్ అందించారు. బీఆర్‌ఎస్ సమన్వయకర్త రాజ సుందర్, పరికిబండ మాజీ సర్పంచ్ అర్జున్, మనోహరాబాద్ ఎంపీటీసీ వెంకటేష్ గౌడ్, శేఖర్ గౌడ్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం



లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి/షాదీ ముబారక్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

కంటోన్మెంట్: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. శుక్రవాకం పికెట్‌లోని తన క్యాంపు కార్యాలయంలో కంటోన్మెంట్ నియోజకవర్గంలోని 62 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని, పేద కుటుంబాలు ఆడపిల్లల పెళ్లిళ్లు చేసి అప్పుల పాలు కావొద్దనే ఉద్దేశంతో ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం ద్వారా రూ.1,16,000 చొప్పున అందిస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని అధికారులతో నిరంతరం పర్యవేక్షించి చెక్కుల పంపిణీ ఆలస్యం కాకుండా చూస్తున్నారని తెలిపారు.

ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో నిత్య కల్యాణ ప్రత్యేక పూజలు జరిగాయి. వరలక్ష్మీ వ్రతం సందర్భంగా శుక్రవారం గర్భగుడిలో అమ్మవారిని పసుపు, కుంకుమతో రాఖీ ఆకారంలో అలంకరించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి మహేందర్‌గౌడ్ తెలిపారు.


నేడు చండీహోమం

సనత్‌నగర్: శ్రావణమాసం శుద్ధ పౌర్ణమి సందర్భంగా సనత్‌నగర్ హనుమాన్ దేవాలయం (సెవెన్ టెంపుల్స్) ప్రాంగణంలోని శ్రీదుర్గామాత ఆలయంలో శనివారం ఉదయం 8 గంటలకు చండీహోమం నిర్వహిస్తున్నట్లు ఈవో సత్యనారాయణనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే శ్రీదత్తాత్రయ స్వామి వారికి ఉదయం 6 గంటలకు అభిషేకం, 9 గంటలకు దత్తహోమం జరుగుతుందని పేర్కొన్నారు.

సంతోషిమాత అమ్మవారికి ప్రత్యేక పూజ

హనుమాన్ దేవాలయ ప్రాంగణంలోని సంతోషిమాత అమ్మవారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ తెలిపారు. అమ్మవారి జయంతి సందర్భంగా ఉదయం 7 గంటలకు 108 కలశాలతో పాలాభిషేకం, పుష్పాలంకరణ ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి శుక్రవారం వ్రత కలశ పూజ, వ్రత ఉద్యాసన ఉంటుందని పేర్కొన్నారు.

వర్షాలకు ధ్వంసమైన అంతర్గత రోడ్లు



లాలాపేట: ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు తార్నాక మున్సిపల్ డివిజన్ పరిధిలోని కాలనీ, బస్తీల అంతర్గత రోడ్లు ధ్వంసం అయ్యాయి. మ్యాన్‌హోల్ వద్ద రోడ్డంతా అడుగు లోతు గుంతలు ఏర్పడ్డాయి. లోతట్టు ప్రాంతాలైన లాలాపేట, సత్యానగర్, ఇందిరానగర్ బస్తీలోని రోడ్లన్నీ గుంతలమయంగా మారాయి. దీంతో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు రాకపోకలు సాగించలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిపై ఇందిరానగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నేతికార్ మహేశ్ మాట్లాడుతూ వర్షాలకు రోడ్లపై ఏర్పడిన గుంతల పూడ్చివేతలో నాసిరకమైన మెటీరియల్ వాడకంతో పూడ్చిన రెండో రోజే గుంతలుగా మారిందన్నారు. అధికారులు గుంతల పూడ్చివేతపై దృష్టిసారించాలన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.43, నల్లవంకాయ రూ.23, పొడుగు వంకాయ రూ.23, బెండకాయ రూ.50, పచ్చిమిర్చి రూ.55, బజ్జీమిర్చి రూ.65, క్యాప్సికమ్ రూ.50, పచ్చకాకర రూ.38, పందిరి బీర రూ.38, క్యాబేజీ రూ.15, క్యారెట్ రూ.41, దొండ రూ.40, గుండుబీన్స్ రూ.55, గింజ చిక్కుడు రూ.45, గోకరకాయ రూ.45, కీర రూ.23, దోసకాయ రూ.15, బీట్‌రూట్ రూ.28, ఉల్లిగడ్డ రూ.20, ఆలుగడ్డ రూ.23, చామగడ్డ రూ.25, మొరంగడ్డ రూ.35, కందగడ్డ రూ.45, సొరకాయ రూ.13, పొట్లకాయ రూ.23, అరటికాయ రూ.11, మునగకాయ రూ.3–4, ముల్లంగి రూ.5–6. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

ఓయూ స్పోర్ట్స్ క్యాలెండర్ విడుదల


ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ స్పోర్ట్స్ క్యాలెండర్‌ను వీసీ ప్రొ.కుమార్ విడుదల చేశారు. క్యాంపస్‌లోని దూరవిద్య కేంద్రంలో శుక్రవారం జరిగిన 2025–26 విద్యా సంవత్సరం వార్షిక సమావేశానికి ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, హెడ్ ప్రొ.రాజేష్ కుమార్ అధ్యక్షత వహించగా వీసీ ప్రొ.కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం అంతర్ కళాశాలల పోటీలలో ఛాంపియన్‌షిప్ సాధించిన కాలేజీల బాలబాలికల పేర్లు ప్రకటించారు. ఇంటర్ కాలేజీ టీమ్ ఛాంపియన్‌షిప్ బాలుర జట్టులో 23 పాయింట్లతో అన్వర్ ఉల్‌మ్ కాలేజీకి మొదటి స్థానం లభించగా 17 పాయింట్లతో సైనిక్‌పురి భవన్స్ వివేకానంద, 15 పాయింట్లతో డా.బీఆర్ అంబేడ్కర్ కాలేజీ 3వ స్థానంలో నిలిచింది. బాలికల జట్టులో 26 పాయింట్లతో మెహిదీపట్నం సెయింట్ ఆన్స్ మహిళా కాలేజీ, 18 పాయింట్లతో విల్లా మేరీ కాలేజీ, 11 పాయింట్లతో కస్తూర్బా గాంధీ కాలేజీలు ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీన్ ప్రొ.లక్ష్మీకాంత్ రాథోడ్, ప్రొ.దీప్లా, ప్రొ.సునీల్ తదితరులు పాల్గొన్నారు.

17న వల్లూరి ఫౌండేషన్ అవార్డుల ప్రధానోత్సవం

లాలాపేట: ఆయా రంగాల్లో నిష్ణాతులైన వారికి వల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవార్డులను అందజేస్తున్నట్లు ఫౌండేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి లింగం తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన తార్నాకలోని ఫౌండేషన్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ వల్లూరి ఫౌండేషన్ అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమాన్ని ఈ నెల 17న రవీంద్రభారతీలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి సినీ నటి, ఎమ్మెల్సీ విజయశాంతి ముఖ్యఅతిథిగా హాజరవుతున్నట్లు తెలియజేశారు. సామాజిక సేవా, కళ, విద్య, వైద్యం, వ్యాపారం, సంగీతం, సాహిత్యం, నృత్యం తదితర రంగాల్లో ప్రతిభ కలిగిన వారు అవార్డుల కోసం ఈ నెల 11వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని లింగం కోరారు. పూర్తి వివరాల కోసం ఫోన్: 63016 21594.

బేగంపేట డీఐ శ్రీనివాస్‌కు ప్రశంసాపత్రం

సనత్‌నగర్: పనిచేసిన సంస్థకే కన్నం వేసి రూ.46.4 లక్షలను చోరీ చేసిన ప్రబుద్ధుడిని ఆరు గంటల్లోనే అరెస్టు చేసిన బేగంపేట డీఐ శ్రీనివాస్‌ను నగర పోలీసు కమిషనర్ అభినందించారు. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో కమిషనర్‌చే శ్రీనివాస్ అవార్డు, నగదు రివార్డుతో పాటు ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. బేగంపేటలోని సన్ ఐ నెక్స్ స్టీల్స్ సంస్థలో గతంలో పనిచేసి మానేసిన ఓ వ్యక్తి రూ.46.4 లక్షల నగదు చోరీ చేశారు. ఈ ఘటనలో ఫిర్యాదు అందిన నిందితుడిని ఆరు గంటల్లోనే మహారాష్ట్ర సరిహద్దులో అరెస్టు చేశారు. ఈ కేసు ఛేదించడంలో వేగంగా స్పందించి నిందితుడిని



పట్టుకున్నందుకు డీఐ శ్రీనివాస్‌కు ఈ అవార్డు లభించింది. ఇదే కేసులో బేగంపేట కానిస్టేబుల్ సతీష్‌కు కూడా కమిషనర్ అవార్డును అందజేశారు.

శ్రీకృష్ణాష్టమిని ఘనంగా నిర్వహించాలి

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ పాన్‌బజార్‌లోని సుప్రసిద్ధ శ్రీవేణుగోపాలస్వామి దేవాలయం ధర్మకర్తల మండలి సమావేశం శుక్రవారం జరిగింది. రానున్న శ్రీకృష్ణాష్టమి వేడుకలను వైభవంగా నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది. ఆలయాన్ని రంగులతో తీర్చిదిద్దాలని, స్వామి పల్లకీ సేవ, అన్నదాన కార్యక్రమం తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని సమావేశం తీర్మానించింది. ఆలయం ఈవో రవికాంత్, ఆలయ కమిటీ చైర్మన్ ఎల్లేష్, సభ్యులు బాబుగౌడ్, సదానంద్, లక్ష్మి, ఎం.అశోక్, సనత్‌నగర్ ఏ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు త్రికాల మనోజ్‌కుమార్, శ్రీనివాస్ ముదిరాజ్, సాయిబాబా, మనోజ్ ఉపాధ్యాయ్ తదితరులు పాల్గొన్నారు.



ధర్మకర్తల మండలి సమావేశం

దళిత క్రైస్తవులను ఎస్సీలుగా గుర్తించాలి



మాట్లాడుతున్న విజయ్

రాంగోపాల్‌పేట్: దళిత క్రైస్తవులు, ముస్లింలను ఎస్సీలుగా గుర్తించాలని కోరుతూ ఈ నెల 9వ తేదీన రెజిమెంటల్‌బజార్‌లోని మదర్ థెరీసా విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు నేషనల్ కౌన్సిల్ ఆఫ్ దళిత్ క్రిష్టియన్ సంస్థ జాతీయ కార్యదర్శి విజయ్ మోతుకూరి తెలిపారు. సికింద్రాబాద్‌లోని కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీసీబీసీ డిప్యూటీ సెక్రటరీ ఫాదర్ రాజ అలెక్స్, ఆర్చ్ డయాసిస్ ఆఫ్ హైదరాబాద్ ఎస్సీ, బీసీ కమిషన్ కార్యదర్శి పాదర్ ప్రభుదాస్, నాయకులు రాబర్ట్ సూర్యప్రకాష్, స్లీవా గెలేలీ తదితరులతో కలిసి మాట్లాడారు. దళితులు, ముస్లింలు మతం మారితే రిజర్వేషన్ మారుతుందని 1950 ఆగస్టు 10వ తేదీన రాష్ట్రపతి ఉత్తర్వులు తెచ్చారని తెలిపారు. అదే దళితులు, సిక్కు, బౌద్ధ మతం స్వీకరిస్తే మాత్రం దళిత రిజర్వేషన్లకు అర్హులని తెలిపారు. ఈ రాష్ట్రపతి ఉత్తర్వులు రద్దు చేయాలని దళిత క్రైస్తవులు డిమాండ్ చేస్తూ వస్తున్నా ప్రభుత్వం కాలయాపన చేస్తూ వస్తోందన్నారు. ఆగస్టు 9వ తేదీ శనివారం బ్లాక్ డేగా పాటిస్తూ నగరంలో నిరసన, ఆగస్టు 11వ తేదీన ఢిల్లీతో పాటు దేశవ్యాప్తంగా నిరసన చేపడతామని తెలిపారు.

మహంకాళి ఆలయంలో శ్రావణ శుక్రవారం పూజలు



గాజులతో ఉజ్జయినీ మహంకాళి అమ్మవారు



అమ్మవారికి సాక సమర్పిస్తున్న దృశ్యం

రాంగోపాల్‌పేట్: శ్రావణ శుక్రవారం సందర్భంగా సికింద్రాబాద్‌లోని మహంకాళి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహంకాళి అమ్మవారిని వివిధ రకాల గాజులతో అలంకరించారు. పెద్ద ఎత్తున మహిళలు అమ్మవారిని దర్శించుకుని పసుపు, కుంకుమ, ఒడిబియ్యం సమర్పించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో మనోహర్‌రెడ్డి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

అమ్మవారికి సాక

అమ్మవారి బోనాల జాతర సందర్భంగా భవిష్యవాణిలో అమ్మవారు చెప్పినట్లు రెండవ శుక్రవారం అమ్మవారికి సాకను సమర్పించారు. మరో మూడు వారాల పాటు అమ్మవారికి ప్పులు, బెల్లంతో సాక సమర్పించాల్సి ఉంది.

పెన్షన్‌దారుల మహాసభను తరలిరండి

అడ్డగుట్ట: అధికారంలోకి వచ్చిన వెంటనే పెన్షన్లు పెంచుతామని హామీ ఇచ్చి నేటికీ అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే పెన్షన్లను పెంచాలని ఎంఎస్పీ జిల్లా అధికారి ప్రతినిధి డప్పు మల్లికార్జున్ డిమాండ్ చేశారు. అడ్డగుట్ట డివిజన్ చంద్రశేఖర్‌నగర్ బస్తీలో వికలాంగులు, చేయూత పెన్షన్‌దారుల సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో వికలాంగులకు రూ.6 వేలు, మిగతా పెన్షన్ దారులకు రూ.4 వేలకు పెంచుతామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చి దాదాపు 20 నెలలు దాటినా రూపాయి కూడా పెంచలేదన్నారు. పెన్షన్ దారులకు న్యాయం చేయడం కోసం వారి పక్షాన మంద కృష్ణమాదిగ పోరాటానికి శ్రీకారం చుట్టారన్నారు. అందులో భాగంగా 25వ తేదీన సికింద్రాబాద్‌లోని సీతాఫల్‌మండిలో నిర్వహించనున్న పెన్షన్‌దారుల మహాసభలో పాల్గొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. నాయకులు చెండేటి వేణుగోపాల్, జోగు దశరథ్, కారంపాడి రాజు, సుజాత, బాబురావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డప్పు మల్లికార్జున్

'రక్షాబంధన్' వేడుకలకు సిద్ధం

- అన్ని ప్రాంతాల్లో జోరుగా రాఖీల విక్రయాలు
- రూ.10ల నుంచి 10 వేల వెండి రాఖీల వరకు



అమీర్‌పేట్ ప్రాంతంలో రాఖీల విక్రయాలు

సనత్‌నగర్: రక్షాబంధన్ వేడుకలకు సనత్‌నగర్ నియోజకవర్గం సిద్ధమైంది. అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్లు.. ఇలా సోదర సోదరీమణుల మధ్య ఆత్మీయ బంధాన్ని చాటిచెప్పేందుకు చిన్నారులు, పెద్దలు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో వీధులన్నీ 'రాఖీ' పండగ శోభను సంతరించుకున్నాయి. అమీర్‌పేట్, ఎస్ఆర్‌నగర్, సనత్‌నగర్ ఇలా ప్రతి ప్రాంతంలోనూ రాఖీల విక్రయాలు జోరందుకున్నాయి. శుక్రవారం సాయంత్రం ఏ వీధిలో చూసినా రాఖీల విక్రయకేంద్రాల వద్ద కొనుగోలుదారుల సందడే కనిపించింది. విభిన్నమైన స్టైల్స్‌లో మార్కెట్లోకి వచ్చిన రాఖీలు చూపరులను కట్టిపడేస్తున్నాయి. వివిధ రకాలైన సాధారణ, ఫ్యాన్సీ రాఖీలు ఆకర్షణీయమైన ఆకృతుల్లో మార్కెట్‌ను ముంచెత్తాయి. రూ.10 నుంచి సాధారణ రాఖీలు మొదలుకొని రూ.10 వేల వరకు వెండి రాఖీలు లభిస్తున్నాయి. నగరంలోనే బేగంబజార్, ధూల్‌పేట, పురానాపూల్, రహీంపురా తదితర ప్రాంతాల్లోని కొన్ని కుటుంబాలు దశాబ్దాలుగా రకరకాల రాఖీలను తమ ఇళ్లల్లోనే తయారుచేస్తుండగా, అక్కడి నుంచి తీసుకువచ్చి ఇక్కడ విక్రయాలు జరుపుతుంటారు.

క్రీడా సంబురం

ఘనంగా ఆల్ ఇండియా ఆర్పీఎఫ్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్

అడ్డగుట్ట: క్రీడాపోటీలు కేవలం పతకాలు సాధించడానికి మాత్రమే కాకుండా స్నేహాన్ని పెంపొందించడం, జ్ఞాపకాలను సృష్టించుకోవడానికి దోహదపడుతాయని ఆర్పీఎఫ్ ఐజీ ఆరోమా సింగ్ అన్నారు. సికింద్రాబాద్‌లోని రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ ఆలకుంట నవీన్‌కుమార్ నేతృత్వంలో ఆల్ ఇండియా ఆర్పీఎఫ్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్–2025 ప్రారంభోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన రైల్వే ఉన్నతాధికారులు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఐజీ అరోమా సింగ్ మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసంతో పాటు శారీరక ధృడత్వం అలవడుతుందన్నారు. కఠినమైన శిక్షణ, సవాళ్లను అధిగమించడానికి ఛాంపియన్‌షిప్‌లు దోహదపడతాయన్నారు. రైల్వే ప్రొటెక్షన్ స్పెషల్ ఫోర్స్‌తో సహా 17 జోనల్ రైల్వేల నుంచి 232 మంది క్రీడాకారులు పాల్గొంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్పీఎఫ్ డీఐజీ షాదాన్ జెబ్ ఖాన్‌తో పాటు ఇతర రైల్వే అధికారులు పాల్గొన్నారు.



ప్రారంభోత్సవంలో ఐజీ ఆరోమా సింగ్

అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం

అమీర్‌పేట: సనత్‌నగర్ సుభాష్‌నగర్‌లో రాజ్యాంగ నిర్మాణ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. బీకేగూడ నుంచి స్వామి థియేటర్‌కు వెళ్లే రోడ్డు మార్గం సుభాష్‌నగర్‌లో ఉన్న విగ్రహాన్ని రాత్రి వేళలో రాళ్లతో కొట్టి ధ్వంసం చేసినట్లు స్థానికులు తెలిపారు. ఉదయం దళిత సంఘం నేతలు ఘటనా స్థలానికి వచ్చి ఆందోళనకు దిగారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్ఆర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు నాయకులు పి.సంతోష్ కుమార్, ఆర్.రామేశ్వర్, ప్రసాద్ తెలిపారు. సీసీ కెమెరాలు పరిశీలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.